సాక్షి
అనంతపురం
మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 పలికాయి.



రచిన్ రవీంద్ర.. ఆర్డీటీలో ముద్ర!

వన్డే వరల్డ్‌కప్‌లో న్యూజిలాండ్ జట్టు తరఫున మంచి ఫామ్‌లో కొనసాగుతున్న క్రికెటర్ రచిన్ రవీంద్రకు ఆర్డీటీతో ప్రత్యేక అనుబంధం ఉంది.

8లో

గరిష్టం/కనిష్టం
37.4°/22.8°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

15 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఖాద్రీశుడు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారు ఒక్కోరోజు ఒక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఈ మేరకు వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. 15వ తేదీ మత్స్యావతార అలంకారం, 16న కూర్మావతార అలంకారం, 17న నృసింహ అవతార అలంకరణ, 18న రామావతార అలంకరణ, 19న కృష్ణావతార అలంకరణ, 20న సరస్వతీ అలంకరణ, 21న మోహినీ అలంకరణ, 22న వేంకటేశ్వర అలంకారాల్లో స్వామి వారు దర్శనమిస్తారన్నారు. 23వ తేదీ విజయదశమి రోజున అశ్వవాహనంపై స్వామి వారి గ్రామోత్సవం ఉంటుందని వెల్లడించారు.

నేడు పెన్షన్ అదాలత్



అనంతపురం సిటీ: కడప రీజనల్‌లోని అన్ని జిల్లాలకు సంబంధించిన ఈపీఎస్–1995 పెన్షనర్లు, సభ్యుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మంగళవారం పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారులు సోమవారం తెలిపారు. అక్టోబర్ నెలకు సంబంధించి పెన్షన్ అదాలత్‌ను ఉదయం 11 గంటలకు 'వెబెక్స్' వేదికగా నిర్వహిస్తున్నామన్నారు. పెన్షనర్లతో పాటు మూడు నెలల్లో పెన్షనర్లు కాబోయే వారు కూడా తమ ఫిర్యాదులను అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. వైఎస్సార్, అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, తిరుపతి, చిత్తూరు జిల్లాల సభ్యులు అదాలత్‌లో పాల్గొనవచ్చని తెలిపారు.
లింక్: https://meetingsapac19.webex.com/meetingsapac19/i.php?MTIC=m3c3d8618e6f95d56a7e9f0061d65b5b6
మీటింగ్ నెంబర్: 2640 733 7172
పాస్‌వర్డ్: 12345

ఆర్టీసీ ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం



అనంతపురం సెంట్రల్: ప్రయాణికులను ఆకట్టుకునేందుకు ఆర్టీసీ గిఫ్ట్ స్కీం ప్రవేశపెట్టింది. అనంతపురం – నార్పల రూట్‌లో పల్లె వెలుగు సర్వీసుల్లో గిఫ్ట్ స్కీం అమలు చేస్తున్నట్లు అనంతపురం డిపో మేనేజర్ నాగభూపాల్ తెలిపారు. ప్రయాణికులు బస్సు దిగి వెళ్లేటప్పుడు వారి టికెట్ల వెనుక పేరు, ఊరు, ఫోన్‌నెంబర్ రాసి డ్రైవర్ సీటు వెనుక ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలని సూచించారు. వీటిని ప్రతి నెలా 17, 31 తేదీల్లో లాటరీ తీసి తొలి ముగ్గురికి బహుమతులు అందజేస్తామన్నారు.

పకడ్బందీగా నీటి నిర్వహణ



అధికారులకు సూచనలిస్తున్న సీఈ శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ దేశేనాయక్

అనంతపురం సెంట్రల్/వజ్రకరూరు: హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా వస్తున్న కృష్ణాజలాలను పకడ్బందీగా అన్ని ప్రాంతాలకూ సమానంగా పంపిణీ చేయాలని జలవనరులశాఖ సీఈ శ్రీనివాసరెడ్డి, హంద్రీ–నీవా ఎస్ఈ దేశే నాయక్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం హెచ్ఎన్ఎస్ఎస్ ప్యాకేజీ–1 పరిధిలోని గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాల్లో హంద్రీనీవా కాలువపై పర్యటించారు. చివరి వరకూ కృష్ణాజలాలను తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న వారాబందీ (ఆన్అండ్ఆఫ్) పద్ధతిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు అన్ని ప్రాంతాల రైతులకు, ప్రజలకు పంపిణీ చేయాలనే సదుద్దేశంతో ఈ పద్ధతి అవలంబిస్తున్నట్లు వివరించారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి దిగువన ఉన్న చెర్లోపల్లి రిజర్వాయర్‌కు ప్రస్తుతం నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వారాబందీ కార్యక్రమం ద్వారా ఫేజ్–1లోని తూములకు మంగళవారం నుంచి 20వ తేదీ వరకు నీరు నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. 21వ తేదీ తిరిగి నీటిని పునరుద్ధరిస్తామన్నారు.

ప్రాణం తీస్తోన్న వేగం

- విషాదం నింపుతున్న రోడ్డు ప్రమాదాలు
- మృతుల్లో ద్విచక్ర వాహనదారులే అధికం
- యువకుల మరణాలతో తల్లిదండ్రులకు గుండెకోత
- 90 శాతం రోడ్డు ప్రమాదాలు మితిమీరిన వేగంతోనే

❑ రెండు వారాల క్రితం గుత్తికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి బైక్‌పై మితిమీరిన వేగంతో అనంతపురం వస్తుండగా గార్లదిన్నె దగ్గర ప్రమాదానికి గురయ్యాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు అర్ధంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా మారింది.

❑ నాలుగు రోజుల క్రితం పెనుకొండ దగ్గర ఉన్న కియా పరిశ్రమ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న యువకుడు మన్నీల గ్రామం దగ్గరకు రాగానే వేగంగా ఐచర్ వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే చనిపోవడంతో తల్లిదండ్రులు దిక్కులేని వారయ్యారు.



రోడ్డు ప్రమాద దృశ్యం



ప్రమాదాల నియంత్రణపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మితిమీరిన వేగం యువత ప్రాణం తీస్తోంది. కుటుంబానికి ఆసరాగా నిలుస్తారనుకున్న యువకులు వేగం మోజులో పడి ప్రాణాలు కోల్పోతున్నారు. యువకులపై తల్లిదండ్రులు గంపెడాశలు పెట్టుకుంటారు. వారు జీవితంలో సాధించాల్సిన లక్ష్యాలు, ఆశయాలపై కోటి ఆశలతో ఎదురు చూస్తుంటారు. ఏ కష్టమొచ్చినా ఎదురొడ్డి పోరాడేందుకు నా కొడుకు ఉన్నాడని గొప్పగా చెప్పుకుంటుంటారు. అలాంటి సమయాన రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళిస్తే తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం. జిల్లాలో ద్విచక్రవాహనదారులు మితిమీరిన వేగంతో వెళుతూ ప్రాణాలు కోల్పోతున్న తీరు విషాదం కలిగిస్తోంది.

ప్యాషన్‌గా మారి ప్రాణం మీదకు..

ఇరవై ఏళ్లు కూడా నిండకుండానే గారాబంతో కొడుక్కు 220 సీసీ బైక్‌ను తల్లిదండ్రులు తీసిస్తారు. బైక్ ఇచ్చారు కదా అని నెమ్మదిగా వెళతాడా అంటే అదీ లేదు. మితిమీరిన వేగంతో వెళ్లడం.. ఎక్కడో ఒక చోట ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవడం షరా మామూలైపోయింది. అయినా యువకుల తీరులో మార్పు రావడం లేదు. ఇంట్లో ఎంత నచ్చజెప్పి పంపినా రోడ్డుమీదకొచ్చే సరికి ప్యాషన్ (మోజు)తో అతివేగంగా డ్రైవ్ చేస్తున్నారు. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 90 శాతం ద్విచక్రవాహనదారులవే. ఇందులో మృతి చెందుతున్నది 90 శాతం మంది 30 ఏళ్ల లోపు యువకులే. ఏడాదికి సగటున 360 మంది యువకులు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారు. అధికారులు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా యువకుల్లో మార్పు రావడం లేదు. యువకులు బైక్ ఎక్కితే చాలు కంటికి కనిపించనంత వేగంతో దూసుకెళ్తున్నారు. ప్రమాదానికి గురై మృతి చెందిన వారిలో 70 శాతం మంది హెల్మెట్ లేకుండా వెళ్లిన వారే.

2023 సంవత్సరంలో జరిగిన ప్రమాదాలు

నెల	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
ఏప్రిల్	61	39	57
మే	55	35	94
జూన్	51	38	41
జూలై	41	30	32
ఆగస్టు	30	19	38
సెప్టెంబర్	39	32	45

వేగమే కొంప ముంచుతోంది

యువకులు ఏదో ఒక గుర్తింపు (ఐడెంటిటీ) వస్తుందన్న ఆలోచనతో మితిమీరిన వేగంతో బైక్‌లు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. అక్కడికీ హెల్మెట్‌లేని వారికి జరిమానాలు విధిస్తున్నాం. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం.
– వీర్రాజు, ఉపరవాణా కమిషనర్

బాలలకు బైకులు ఇవ్వొద్దు

పాతికేళ్ల కుర్రాళ్లు అనగానే కుటుంబానికి అండగా నిలవాల్సిన వారు. జీవితంలో ఎన్నో సాధించాల్సిన వయసులో ఇలా నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రాణం మీదకు తెచ్చుకోవడం బాధాకరం. పద్దెనిమిదేళ్ల లోపు వాళ్లకు తల్లిదండ్రులు బైకులు ఇవ్వరాదని సూచిస్తున్నాం. చాలా ప్రాంతాల్లో పోలీసుల ఆధ్వర్యంలో ప్రమాదాల నియంత్రణకు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. రవాణాశాఖ పరిధిలో తరగతులు నిర్వహిస్తున్నాం.
– ఆర్.ఎస్.అమ్మిరెడ్డి, డీఐజీ, అనంతపురం

మనోధైర్యంతో ముందుకెళ్లండి

- సమస్య ఉంటే ఫోన్ ద్వారా తెలపండి
- ఆత్మహత్య దేనికీ పరిష్కారం కాదు
- ఎస్పీ అన్బురాజన్



అనంతపురం క్రైం: సమస్యలు వచ్చినపుడు ఆత్మహత్య చేసుకోకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలని ఎస్పీ అన్బురాజన్ పిలుపునిచ్చారు. ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. క్షణికావేశంలో ప్రాణం తీసుకోవాలనే తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దన్నారు. సమస్యలుంటే ప్రభుత్వం, పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ధైర్యం కోల్పోరాదని, మిమ్మల్ని నమ్ముకుని ఉన్న భార్యాపిల్లలు, తల్లిదండ్రుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆలోచించాలని పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలున్నా టోల్ ఫ్రీ నంబర్లు 14416 లేదా 80089 14416కు గానీ లేదా తన నంబర్ 94407 96800కు గానీ ఫోన్ చేస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇతర శాఖల సమస్యలైనా సరే సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. సమస్య ఉంటే దాని పరిష్కారం కూడా వెన్నంటే ఉంటుందన్నారు. ధైర్యం కోల్పోకుండా సమస్యలపై పోరాడాలని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లా సర్వజనాస్పత్రిలో ప్రత్యేకంగా ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించేందుకు విభాగం (18వనంబర్ ఓపీ కౌంటర్) ఉందని, అక్కడికైనా నేరుగా వెళ్లడం లేదా పోలీసులను సంప్రదించినా ఆత్మహత్యను ఆపేవిధంగా చైతన్యం తీసుకొస్తారని తెలిపారు

జెడ్పీలో ఆన్‌లైన్ సేవలు!

- వెబ్‌సైట్ రూపొందిస్తున్న అధికారులు
- రాష్ట్రంలో సొంత వెబ్‌సైట్ కలిగిన రెండో జిల్లాగా అనంత
- ఇకపై జెడ్పీటీసీ సభ్యులందరికీ ప్రత్యేక లాగిన్ ఐడీలు
- పనుల ప్రతిపాదనలు ఆన్‌లైన్‌లో పంపేలా ఏర్పాట్లు
- పనుల ప్రగతిపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రభుత్వ విభాగాల్లో అతిపెద్దదిగా జిల్లా పరిషత్‌కు పేరుంది. స్కూళ్లు, గ్రామీణ నీటిసరఫరా, ఎంపీడీఓల వ్యవస్థ... ఇలా ఒకటేమిటి వేలాదిమంది ప్రభుత్వ ఉద్యోగులు కలిగిన ఈ విభాగం త్వరలోనే కొత్త తరహాలో పాలనా వ్యవహారాలు చేపట్టనుంది. జిల్లాస్థాయిలో ఒక విభాగం ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించి పనులు చేపట్టడం కష్టమే. అలాంటిది అనంతపురం జిల్లాలో జెడ్పీ విభాగాన్ని ఆన్‌లైన్ పరిధిలోకి తెస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే ఈ వ్యవస్థను అమల్లోకి తీసుకొస్తారు.

కొత్త వెబ్‌సైట్ ఇలా..

ప్రస్తుతం జిల్లా పరిషత్ ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఒకటే ఉంది. కో ఆప్షన్ మెంబర్‌తో పాటు 63 మంది జెడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. వీరంతా వివిధ పనుల కోసం జెడ్పీకి వస్తుంటారు. ఇకపై ఇలాంటి పరిస్థితి లేకుండా zpananthapuram.ap.gov.in పేరుతో కొత్త వెబ్‌సైట్ తీసుకొస్తున్నారు. ప్రతి జెడ్పీటీసీ మెంబర్‌కు ఒక్కో లాగిన్ ఐడీ ఇస్తారు. ఇకపై ఆ లాగిన్ ద్వారా తమ మండల పరిధిలో జరిగే పనుల ప్రగతి లేదా ప్రతిపాదనలు పంపుకోవచ్చు. ఇప్పటివరకూ ప్రత్యేక వెబ్‌సైట్ కలిగి ఉన్న జెడ్పీ గుంటూరు మాత్రమే ఉంది. ఏపీలో జెడ్పీ ఆన్‌లైన్ పరిధిలోకి రాబోతున్న రెండో జిల్లాగా అనంతపురాన్ని చెప్పుకోవచ్చు.

ఐవీఆర్ఎస్ విధానం అమలు

ఐవీఆర్ఎస్ అంటే ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం అంటారు. ఈ విధానం ద్వారా జెడ్పీలో జరుగుతున్న పలు వర్కులపై ప్రజాభిప్రాయం తెలుసుకుంటారు. అంతేకాదు జెడ్పీటీసీల నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాలు తెలుసుకుని అమలు చేయాలనేది ముఖ్య ఉద్దేశం. ఐవీఆర్ఎస్ ద్వారా తాగునీరు మొదలుకొని, రోడ్డు పనుల వరకూ ఆయా ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే వీలుంటుంది. అభిప్రాయం తెలిపే వారి పేరు, ఊరు అన్నీ నమోదు చేస్తారు. దీనివల్ల అధికారులు, కాంట్రాక్టర్లు, ఇతర సిబ్బందిలో పారదర్శకత వస్తుందనేది ముఖ్య ఉద్దేశం.

పనులపై ప్రతి బుధవారం సమీక్ష

జెడ్పీ అంటే ఉద్యోగులే కాదు.. పనులు అత్యంత కీలకం. ఇకపై ప్రతి బుధవారం పనులపై సమీక్ష నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. సమీక్ష నిర్వహించిన రోజు ప్రోగ్రెస్ ఏమేరకు ఉంది, తర్వాత జరిగే నాటికి అభివృద్ధి ఏమిటి అనేది బేరీజు వేస్తారు. దీన్నిబట్టే ఇకపై కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తారు. ఇప్పటివరకు ఇలాంటి సమీక్షలు లేకపోవడంతో పనుల్లో తీవ్ర జాప్యం జరిగేది. ఇకపై ఆ పరిస్థితి ఉండదు. జెడ్పీ చైర్‌పర్సన్ నుంచి సీఈఓ వరకు ఫైళ్ల పరిష్కారం కూడా ఇకపై ఆన్‌లైన్‌లో జరిగేలా చూస్తారు.

పారదర్శకత కోసమే..



ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించడం ద్వారా పనుల పరిష్కారం వేగంగా ఉంటుంది. దూరంగా ఉన్న జెడ్పీటీసీ సభ్యులు అనంతపురం రావాల్సిన పనిలేదు. తమకు ఇచ్చిన లాగిన్ ద్వారా మాకు ప్రతిపాదనలు పంపించవచ్చు. ఇప్పటివరకూ ఏపీలో గుంటూరులో మాత్రమే జిల్లాపరిషత్‌కు ప్రత్యేక వెబ్‌సైట్ ఉంది. త్వరలోనే ఇక్కడ ప్రవేశపెట్టి ఆన్‌లైన్ ద్వారా పనులు చేయబోతున్నాం.
– కేతన్‌గార్గ్, సీఈఓ, జిల్లా పరిషత్

రబీ సాగుకు సన్నద్ధం

- 76 వేల మెట్రిక్ టన్నుల ఎరువులకు ప్రణాళిక
- ఇప్పటికే వివిధ కంపెనీల ఎరువుల నిల్వ
- జిల్లాలో మొదలైన సబ్సిడీ విత్తన పంపిణీ



అనంతపురం అగ్రికల్చర్: రబీ సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. రైతులు ఇబ్బంది పడకుండా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఇతరత్రా ఇన్‌పుట్స్ అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఇందుకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం, వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేసింది. ఆర్‌బీకే వేదికగా రైతులకు విస్తృత సేవలు అందేలా చర్యలు చేపట్టారు. రబీ సాగు కోసం 40 శాతం రాయితీతో విత్తన పప్పుశనగ పంపిణీ మొదలైంది. త్వరలోనే విత్తన వేరుశనగ అందజేయనున్నారు. ఈ నెల 15 తర్వాత ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో వర్షాలు పడే సూచన ఉండటంతో రైతులు సాగుకు సమాయత్తం చేశారు.

పక్కాగా ఎరువుల ప్రణాళిక : రబీలో జిల్లాకు 76 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని వ్యవసాయ శాఖ ప్రణాళిక రచించి అమలు చేస్తోంది. ఇందులో అత్యధికంగా 32,500 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్‌లు, 27,450 మెట్రిక్ టన్నుల యూరియా, 7,330 మెట్రిక్ టన్నుల డీఏపీ, 4,550 మెట్రిక్ టన్నులు సింగిల్ సూపర్‌పాస్ఫేట్ (ఎస్ఎస్‌పీ), 3,840 మెట్రిక్ టన్నుల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు కేటాయించారు. అక్టోబర్‌లో 19,940 మెట్రిక్ టన్నులు, నవంబర్‌లో 13,450 మెట్రిక్ టన్నులు, డిసెంబర్‌లో 10,350 మెట్రిక్ టన్నులు, జనవరిలో10,280 మెట్రిక్ టన్నులు, ఫిబ్రవరిలో 10,130 మెట్రిక్ టన్నులు, మార్చిలోల 11,520 మెట్రిక్ టన్నులు... ఇలా రబీలో అక్టోబర్ నుంచి వచ్చే మార్చి వరకు నెలవారీగా కంపెనీల నుంచి సరఫరా అయ్యేలా ప్రణాళిక తయారు చేసి అమలు చేస్తున్నారు.

అందుబాటులో 35 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు : 1.10 లక్షల మెట్రిక్ టన్నుల ఖరీఫ్ ప్రణాళిక మేరకు వివిధ కంపెనీల నుంచి సరఫరా సక్రమంగా జరగడంతో ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 35 వేల మెట్రిక్ టన్నులు ఎరువులు అందుబాటులో ఉన్నాయి. మార్క్‌ఫెడ్, వ్యవసాయశాఖ ద్వారా ఆర్‌బీకేలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లకు ప్రాధాన్యత ఇస్తూనే ఇండెంట్ ప్రకారం హోల్‌సైల్, రిటైల్ డీలర్లకు సరఫరా చేస్తున్నారు. అత్యవసరం కోసం కంపెనీ గోదాములు, మార్క్‌ఫెడ్ దగ్గర బఫర్ స్టాక్ పెడుతున్నారు. అత్యధికంగా కాంప్లెక్స్ ఎరువులు 16 వేల మెట్రిక్ టన్నులు, యూరియా 7 వేల మెట్రిక్ టన్నులు, డీఏపీ 5,500 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 4,300 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 1,500 మెట్రిక్ టన్నులు, మరికొద్దిగా కంపోస్టు ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయశాఖ జిల్లా అధికారి (డీఏఓ) యు.ఉమామహేశ్వరమ్మ తెలిపారు. అందులో ఆర్‌బీకే హబ్‌ల పరిధిలో 5,400 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్‌ల దగ్గర 200 మెట్రిక్ టన్నులు, రిటైల్ దుకాణాల్లో 16 వేల మెట్రిక్ టన్నులు, హోల్‌సేల్ డీలర్ల దగ్గర 3,200 మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ దగ్గర బఫర్‌స్టాక్ కింద 1,200 మెట్రిక్ టన్నులు, కంపెనీ గోదాముల్లో 9 వేల మెట్రిక్ టన్నుల వరకు అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

సమస్యలకు నాణ్యమైన పరిష్కారం



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపించినప్పుడే ప్రజలకు మేలు కలుగుతుందని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల్లో ప్రజలు సమర్పించే అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్, డిప్యూటీ కలెక్టర్లు కేశవనాయుడు, శ్రీనివాసులు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 468 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

12న గృహప్రవేశాలు

'నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ఈ నెల 12న జిల్లాలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. ఇళ్ల నిర్మాణం, జగనన్న ఆరోగ్య సురక్ష, తదితర అంశాలపై కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ నుంచి డివిజన్, మండల, మునిసిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గృహప్రవేశాల్లో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యం మేరకు 20,345 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారన్నారు. వీటికి సంబంధించి లబ్దిదారులకు స్వాధీన పత్రాలను అందించాలని ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లు డిసెంబరు నెలఖారుకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఓపీ వివరాలు అప్‌లోడ్ చేయాలి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏరోజుకారోజు ఓపీ వివరాలు అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్యాంపుల్లో ఫిజికల్‌గా నమోదైన డేటాకి ఆన్‌లైన్ డేటా నమోదులో తేడా రాకూడదన్నారు.

పనులు పూర్తి చేయాలి

'గడపగడపకూ మన ప్రభుత్వం' కింద చేపట్టిన పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గుత్తి, తాడిపత్రి మునిసిపాలిటీల పరిధిలో పనుల పరోగతి ఆశించినస్థాయిలో లేదని అసహనం వ్యక్తం చేశారు.







క్లుప్తంగా

విషపురుగు కాటుతో వ్యక్తి మృతి



మృతి చెందిన కుళ్లాయప్ప

తాడిపత్రి: విషపురుగు కాటుకు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండల పరిధిలోని వెంకటాంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఎంపలాకు కుళ్లాయిస్వామి (39) ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాగానే నోటి నుంచి నురుగుతో కిందపడిపోయాడు. వెంటనే కుళ్లాయిస్వామిని కుటుంబ సభ్యులు తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతికి కారణాలు పోస్టుమార్టం నివేదికలో తెలియాల్సి ఉందని రూరల్ ఎస్సై మహమ్మద్ గౌస్ తెలిపారు. మృతుడికి భార్య పుష్పావతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఎద్దుల బండి కింద పడి యువకుడి మృతి



మృతుడు తిప్పేస్వామి

రాయదుర్గం రూరల్: ఎద్దుల బండి కింద పడి కురుబ తిప్పేస్వామి (19) అనే యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని వడ్రహొన్నూరు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు.. తండ్రి కురుబ శివరుద్రప్పతో కలిసి తిప్పేస్వామి వ్యవసాయ తోటలోకి ఉదయం ఎద్దులబండిలో బయలుదేరాడు. ఊరి బయట తన భుజంపై ఉన్న చెర్నాకోలు కిందపడింది. తిప్పేస్వామి కిందకు దిగి తీసుకుంటుండగా బండి ముందుకు కదిలింది. దీంతో యువకుడిపై టైరు ఎక్కింది. తండ్రి బండిని నిలిపి, గాయపడిన కుమారుడిని హుటాహుటిన రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎద లోపలి భాగంలో నరాలు, కండరాలు దెబ్బతిన్నాయని వైద్యులు తెలిపారు. కళ్ల ముందే చేతికొచ్చిన కుమారుడు కానరాని లోకాలకు వెళ్లడంతో తండ్రితో పాటు తల్లి అనసూయమ్మ కన్నీరుమున్నీరుగా విలపించారు. శివరుద్రప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రచిన్ రవీంద్ర..'ఆర్డీటీ'లో ముద్ర!



ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, విశాల ఫెర్రర్‌తో రచిన్ రవీంద్ర (ఫైల్)



ఇటీవల ఆర్డీటీ స్టేడియంలో జరిగిన టోర్నమెంట్‌లో పాల్గొన్న రచిన్

అనంతపురం: వరల్డ్‌కప్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. రెండు రోజుల క్రితం ఇండియా, ఆస్ట్రేలియా మ్యాచ్ ఉత్కంఠ రేపింది. ఇలాగే, మూడు రోజుల క్రితం న్యూజిలాండ్, ఇంగ్లండ్ మధ్య జరిగిన మ్యాచ్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఆటగాడు రచిన్ రవీంద్ర సెంచరీ చేసి పలువురి ప్రశంసలు పొందాడు. న్యూజిలాండ్ జట్టు తరఫున మంచి ఫామ్‌లో కొనసాగుతున్న రచిన్ రవీంద్రకు ఆర్డీటీతో అనుబంధం ఉండడం గమనార్హం. ప్రవాస భారతీయ సంతతికి చెందిన రచిన్ రవీంద్ర 2017, 2018, 2019, 2023లో ఆర్డీటీ నిర్వహించిన పలు టోర్నీల్లో పాల్గొన్నాడు. రచిన్ రవీంద్ర తండ్రి రవీంద్ర బెంగళూరుకు చెందిన



అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో రచిన్ రవీంద్ర

వారు. రెండు దశాబ్దాల క్రితం న్యూజిలాండ్ వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. రచిన్ రవీంద్రకు న్యూజిలాండ్ పౌరసత్వం ఉంది. ఆదేశం తరఫున ప్రస్తుతం వరల్డ్‌కప్ టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన మాజీ రంజీ ఆటగాడు షాబుద్దీన్, జోషి, యుగంధర్ రెడ్డి ఆర్డీటీలో రచిన్ రవీంద్రకు ప్రత్యేక కోచ్‌లుగా ఉంటూ, మెళకువలు నేర్పించారు. తన తల్లి రూప స్ఫూర్తితోనే అంతర్జాతీయ క్రికెట్‌లో రాణిస్తున్నట్లు రచిన్ రవీంద్ర పేర్కొన్నాడు. అనంతపురం ఆర్డీటీలో తీసుకున్న శిక్షణే క్రికెట్‌లో రాణించడానికి దోహదం చేసిందని తెలిపాడు. కాగా, రాహుల్ ద్రవిడ్, సచిన్ టెండూల్కర్ వీరాభిమానులు అయిన రచిన్ రవీంద్ర తల్లిదండ్రులు రాహుల్ ద్రవిడ్ అనే పేరు నుంచి ' ర ' అనే పదాన్ని, సచిన్ అనే పేరు నుంచి 'చిన్' అనే పదాన్ని తీసుకున్నారు. రచిన్ రవీంద్ర అనే పేరు పెట్టారు.

● వెంటే శున'కమ్..కమ్..'!

విశ్వాసానికి పెట్టింది పేరైన జీవి ఏదైనా ఉందంటే అది శునకమే. రోజూ కొంత అన్నం పెడితే చాలు మనం ఏం చెప్పినా చేసేస్తుంది. మనకేదైనా అపాయం ఎదురైతే తనూ ఎదురొడ్డుతుంది. ఎక్కడికి వెళ్తే అక్కడికి వచ్చేస్తుంది. మనం వద్దని వారించినా విననంటుంది. ఎంత సేపైనా వెంటే ఉంటుంది. ఈ మాటలకు అద్దం పట్టే చిత్రమే ఇది. సోమవారం బెళుగుప్ప మండలం జల్లిపల్లి సమీపంలో కనిపించింది. ఎద్దుల బండిలో రైతు శంకరప్ప పొలానికి వెళ్తుండగా, పెంచుకున్న శునకం కూడా వెంటే బయలుదేరింది. అంతేనా.. బండి ఎక్కి ఇలా ఠీవిగా ప్రయాణించింది. ఆకట్టుకునే ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

- తరలివచ్చి చికిత్సలు పొందుతున్న ప్రజలు
- నేడు 28 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు : డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి
- సద్వినియోగం చేసుకోవాలని పిలుపు

అనంతపురం మెడికల్/పెద్దపప్పూరు/తాడిపత్రి టౌన్: పేద ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. క్యాంపులకు ప్రజలు తరలివచ్చి సేవలు పొందుతున్నారు. సోమవారం జిల్లాలోని బీకే సముద్రం, ఓబుళాపురం, కల్లూరు, సొల్లాపురం, పసలూరు, సెనగలగూడూరు, ఎర్రగుట్టపల్లి, వెలిగొండలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించారు. 32 మంది స్పెషలిస్టు వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు, పదుల సంఖ్యలో ఆరోగ్య శాఖ సిబ్బంది రోగులకు సేవలందించాలన్నారు. జనరల్ మెడిసిన్, సర్జరీ, ఆప్తమాలజీ, గైనకాలజీ, తదితర విభాగాల్లో రోగులకు స్క్రీనింగ్ నిర్వహించారు. మొత్తం 2,257 మంది ఓపీ సేవలు అందుకోగా, అందులో 75 మందికి జిల్లా ఆస్పత్రి, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఓపీకి హాజరైన అందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

విధిగా పరీక్షలు నిర్వహించాలి

వైద్య శిబిరాలకు వచ్చే ప్రజలకు వారి సమస్యకనుగుణంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం గూడూరు, పసలూరు, పెద్దపప్పూరు, ఎర్రగుంటపల్లి ప్రాంతాల్లో జరిగిన వైద్య శిబిరాలను డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పకడ్బందీగా స్క్రీనింగ్ చేయాలన్నారు. సమస్యలున్న వారిని జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేయాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపులను నిర్వహించాలన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఎంహెచ్‌ఓ వెంట డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



పుట్లూరు: వైద్య పరీక్షలపై ఆరా తీస్తున్న జిల్లా వైద్యాధికారి భ్రమరాంబదేవి

నేడు 28 ప్రాంతాల్లో క్యాంపులు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి మంగళవారం జిల్లాలోని 28 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో హెల్త్ క్యాంపులు జరగనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. తలుపూరు, బీ రామసాగరం, తీటకల్, కొర్రపాడు, హావళిగి, యర్రగుంట్ల, రాజాపురం, రంగసముద్రం, దొనిముక్కల, పాలవాయి, ములకనూరు, తుబంబిగనూరు, కూడేరు, మహాంతపురం, సిద్ధరాచెర్ల, రామగిరి, పెద్దపప్పూరు, దిమ్మగుడి, కడవకల్లు, వేపరాళ్ల, సీ బండమీదపల్లి, వెంకటరెడ్డిపల్లి, రాయంపల్లి, కొనకొండ్ల, చీకలగురికి, యాడికి, కూచివారిపల్లి, నీరుగంటి వీధి వైఎస్సార్ విలేజ్, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో శిబిరాలుంటాయని తెలిపారు.

జన చైతన్య వేదిక కాదు.. ధన చైతన్య వేదిక

- లక్ష్మణరెడ్డి తీరు హాస్యాస్పదం
- మండిపడిన కేవీ రమణ

రాప్తాడురూరల్: లక్ష్మణ రెడ్డి 'జన చైతన్య వేదిక'ను 'ధన చైతన్య వేదిక'గా మార్చారని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కృష్ణా జలాల పంపిణీకి ఆంధ్రప్రదేశ్ విభజన ఒక కారణమైతే, గత టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లు బీజేపీతో అంటకాగి, విభజన హామీలను తాకట్టు పెట్టిన చంద్రబాబు మరో కారణం అని పేర్కొన్నారు. అయితే.. లక్ష్మణరెడ్డి వ్యక్తిగతంగా స్థాపించుకున్న జన చైతన్య వేదిక ద్వారా జనాన్ని చైతన్యం చేయకపోగా మాయ చేస్తున్నాడని విమర్శించారు. నిన్నటిదాకా 'సారా నియంత్రణ కమిటీ' చైర్మన్‌గా ఉంటూ నెలకు రూ.5 లక్షల ప్రభుత్వ సొమ్మును మెక్కేసి, అతని దొంగతనాలు బయటపడిన కారణంగా ఆ పదవి నుంచి తొలగిస్తే, నేడు చంద్రబాబు పంచన చేరాడని దుయ్యబట్టారు. అబద్ధాల హరిచంద్రుడులుగా పేరుగాంచి, చంద్రబాబుకు వందిమాగధులుగా ఉన్న సీపీఐ రామకృష్ణ, దేవినేని ఉమామహేశ్వరరావు లాంటి విలువలు లేని వారితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను తిట్టించి, లక్ష్మణ రెడ్డి మీద పడిన మరకను చెరిపేసుకోవడానికి ప్రయత్నించారు తప్ప ప్రాజెక్టులపై ప్రేమ కాదని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అడ్డంగా దొరికిపోయి, అదే దొంగ సొమ్ము కోట్లాది రూపాయలు వెచ్చించి, ఖరీదైన లాయర్లను పెట్టి బయటకు రావాలనుకుంటున్న బాబు భయపడుతున్నాడా? కేంద్ర ప్రభుత్వాన్ని ఎదిరించి, సొంత పార్టీ పెట్టి, 151 సీట్లతో అధికారాన్ని చేజిక్కించుకున్న జగన్ భయపడుతున్నారా? కృష్ణా ఎగువ భాగంలో ప్రాజెక్టుల నిర్మాణానికి, నేడు కృష్ణా జలాల పునః పంపిణీకి నాలుగేళ్ల పాలించిన జగన్ బాధ్యుడా? 14 ఏళ్లు పాలించిన బాబు బాధ్యుడో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. మీరు ఎన్ని కుయుక్తులు పన్నినా 2024లో వైఎస్ జగన్ విజయాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

'కృష్ణా జలాల పునః పంపిణీ వద్దే వద్దు'

అనంతపురం టవర్ క్లాక్: కృష్ణా జలాలను సమీక్షించి పునః పంపిణీ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అసంబద్ధమని, నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం కరువు ప్రాంతాలకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తా మనడం సిగ్గుచేటన్నారు. రాయలసీమ రైతులను అధోగతి పాలు చేసే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ నెల 12న జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సంతకాల సేకరణ చేపడుతున్నట్లు ప్రకటించారు. తమ డిమాండ్లు ప్రభుత్వం ముందుంచుతామన్నారు. ఇప్పటికే ఇరు రాష్ట్రాల్లో ప్రాజెక్టుల వారీగా వినియోగంలో ఉన్న నీటి పంపిణీ యథాతథంగా ఉంచాలన్నారు. అదనపు, మిగులు జలాలను విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం కరువు పీడిత ప్రాంతాలకు కేటాయించాలన్నారు. హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం సుప్రీంకోర్టులో కేసు వేయాలని డిమాండ్ చేశారు. కృష్ణా యాజమాన్య బోర్డును విశాఖపట్నంలో కాకుండా కర్నూలులో ఏర్పాటు చేయాలన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేయడంలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించాలని, సిద్దేశ్వరం అలుగు నిర్మాణానికి సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో అభివద్ధి వికేంద్రీకరణ సాధన సమితి గౌరవాధ్యక్షులు ఆలూరు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజా హొన్నూర్, ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శి రాజేశ్వరి, కోశాధికారి కేవీ కుమార్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు బండి సత్యనారాయణ రెడ్డి, కోదండరాం, మహమ్మద్ అలీ, బన్నీ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

కిందపడి పెయింటర్ మృతి



మృతుడు వేణుగోపాల్

గుత్తి: పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన పెయింటర్ వేణుగోపాల్ (32) ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు.. గుత్తిలోని బీసీ కాలనీకి చెందిన వేణుగోపాల్ సోమవారం ఉదయం పెయింట్ కొడుతూ ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కార్మికులు గుర్తించి స్థానిక ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు వంటల పోటీలు

అనంతపురం అర్బన్: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న నాణ్యమైన బియ్యంలోని పోషక విలువలపై అవగాహన కల్పించేందుకు మహిళలకు మంగళవారం వంటల పోటీలు నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. స్థానిక కృష్ణకళామందిర్‌లో మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఐసీడీఎస్, మెప్మా, డీఆర్‌డీఏ నుంచి ఎంపిక చేసిన దాదాపు 50 మంది బియ్యం కార్డులు కలిగిన మహిళలు పోటీల్లో పాల్గొంటారన్నారు. నాణ్యమైన బియ్యంతో వివిధ రకాల వంటకాలు చేసి ప్రదర్శిస్తారన్నారు. నాణ్యమైన వంటలు చేసిన మహిళలకు బహుమతులు ఉంటాయన్నారు. మొదటి బహుమతి రూ.3 వేలు, రెండో బహుమతి రూ.2 వేలు, మూడో బహుమతి రూ.వెయ్యి పంపిణీ చేస్తామన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ఆత్మకూరు: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తలుపూరు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన శివ (54) ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో డ్రైవర్‌గా విధులు నిర్వహించేవాడు. ఆదివారం రాత్రి తన ఇంట్లో విద్యుత్ అంతరాయం తలెత్తడంతో మేడపైకి ఎక్కి వైర్లు సరి చేసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిసింది.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- అదనపు చార్జీలేమీ లేవు



అనంతపురం సెంట్రల్: దసరా పండుగ సందర్భంగా దూరప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడపుతున్నట్లు ఆర్టీసీ జిల్లాప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, తిరుపతి, ఒంగోలు, నెల్లూరు చెన్నై నుంచి జిల్లాకు రావడానికి ఈ నెల 18 నుంచి 23 వరకు మొత్తం 95 అదనపు బస్సులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయడం లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీ వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. ఈ నెల 23 నుంచి 29 వరకు తిరుగు ప్రయాణానికి కూడా 98 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రానుపోను టికెట్ బుక్ చేసుకున్న వారికి 10 శాతం రాయితీ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఆన్‌లైన్ సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రత్యేక బస్సుల వివరాలు

ప్రాంతం	దసరాకు మునుపు	దసరా తర్వాత
బెంగళూరు	34	46
విజయవాడ	9	7
తిరుపతి	11	4
ఒంగోలు/నెల్లూరు	1	2
హైదరాబాద్	37	33
చెన్నై	3	6

నెట్టికంటి ఆలయ ఈఓగా గురుప్రసాద్

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానం ఈఓగా గురుప్రసాద్ నియమితులయ్యారు. దేవదాయ శాఖ కర్నూలు జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న ఈయనను ఈఓగా బదిలీ చేస్తూ సోమవారం ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త ఈఓ ఈనెల 10వ తేదీ (మంగళవారం) బాధ్యతలు తీసుకోనున్నట్లు ఆలయ ఏఈఓ ధనుంజయ తెలిపారు. కాగా, కర్నూలులోని దేవదాయ శాఖ నగల పరిశీలన అధికారిగా ఉన్న డీ.వెంకటేశ్వరరెడ్డి ఇప్పటివరకూ కసాపురం దేవస్థానం ఇన్‌చార్జ్ ఈఓగా విధులు నిర్వహిస్తూ వచ్చారు.

బాల్య వివాహాలు అరికట్టేందుకు చర్యలు

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: బాల్య వివాహాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సాంఘిక మహిళ శిశు వికలాంగుల వృయో వృద్ధుల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. సోమవారం విజయవాడలో మహిళల ఆరోగ్యం, పరిశుభ్రత, బాల్యవివాహాలు అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యంగా సినిమా పరిశ్రమ నుంచి బ్రాండ్ అంబాసిడర్‌తో యాడ్స్ ద్వారా అవగాహన కల్పించడం, విద్యా వ్యవస్థలో యోగా అవసరం, దివ్యాంగుల పింఛన్లు, జువైనల్ స్పెషల్ హోమ్స్, ఎడ్యుకేషన్, హోం డిపార్టుమెంట్ కలిసే విధంగా ప్రణాళిక తయారు చేయడం, మహిళల్లో దీర్ఘ కాలిక రోగాలపై అవగాహన కల్పించడం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కంగాటి శ్రీదేవమ్మ, రెడ్డి శాంతి, డాక్టర్ సుధా, సూర్యనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, కల్పనరెడ్డి, అసెంబ్లీ డిప్యూటీ కార్యదర్శి వనితరాణి, అసిస్టెంట్ కార్యదర్శి రజనీ, ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి, హెల్త్ అండ్ ఫ్యామిలీ కమిషనర్ నివాస్, వెల్ఫేర్ డైరెక్టర్ ప్రసాద్ పాల్గొన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడిపై దాడి

ఉరవకొండ: పట్టణానికి చెందిన 19వ వార్డు సభ్యురాలు గుత్తి బానుబేగం కుమారుడు, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నాయకుడు గుత్తి తాజుద్దీన్‌పై సోమవారం కొందరు దాడికి పాల్పడ్డారు. బానుబేగం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. పార్కు ఆంజనేయస్వామి ఆలయం వెనక వైపు తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొనడంతో పంచాయతీ నిధులతో నూతన ట్యాంకు ఏర్పాటు చేశారు. అయితే, ట్యాంకు రోడ్డుకు అడ్డంగా ఉందని వాదిస్తూ పక్క వార్డుకు చెందిన హరున్, జాఫర్, దావూద్, యూనుస్ సోమవారం తాజుద్దీన్‌తో ఘర్షణకు దిగారు. దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరించడమే కాకుండా దాడి చేశారు. అడ్డుకోబోయిన వార్డుకు చెందిన వెంకటేష్‌ను కూడా తీవ్రంగా కొట్టారు. దాడి చేసిన వారిపై బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసు స్పందనకు 175 అర్జీలు



అర్జీదారుల సమస్య వింటున్న ఎస్పీ

అనంతపురం క్రైం: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో 175 అర్జీలు అందాయి. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అర్జీలు స్వీకరించి ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడారు. వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశాలు జారీ చేశారు. సమస్యలుంటే జిల్లా పోలీసు 'స్పందన' విభాగం నంబర్ 9392926803లో తెలియజేయాలని ప్రజలకు సూచించారు. సైబర్ క్రైమ్‌లపై వెబ్‌సైట్ www.cybercrime.gov.in ద్వారా లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ ఆంథోనప్ప, ఎస్బీ సీఐ ఇందిర పాల్గొన్నారు.

పేలుడు పదార్థాల నిల్వలపై నిఘా పెంచండి

పేలుడు పదార్థాల నిల్వలపై నిఘా పెంచాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిబంధనల మేరకు మైనింగ్ చేయాలని, ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్వారీల యజమానులకు నిబంధనలను ఉల్లంఘించకుండా హెచ్చరికలు చేయాలన్నారు. ఎక్కడైనా అక్రమంగా పేలుడు పదార్థాలు నిల్వ చేసినట్లు తెలిస్తే తన నంబర్ 9440796800కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు. వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు పలు చోట్ల పోలీసులు తనిఖీలు చేపట్టారు.

వెళ్లిపోతున్నా.. వెతకొద్దు!

- లేఖ రాసి బాలుడి పరారీ
- అతని వెంటే మరో ఇద్దరు
- లబోదిబోమంటూ పోలీసుస్టేషన్‌కు తల్లిదండ్రులు
- గంటల వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు



పిల్లలతో పోలీసులు

అనంతపురంక్రైం: ''అమ్మా నాన్న నేను వెళుతున్నాను నన్ను వెతకొద్దు'' అంటూ ఓ 5వ తరగతి విద్యార్థి లేఖ రాసి ఇంటి తలుపులకు అతికించి పరారయ్యాడు. అతనితోపాటు ద్వారక కాలనీలో నారాయణ స్కూల్‌లో చదివే మరో ఇద్దరు విద్యార్థులు కనిపించకుండా పోయారు. సోమవారం సాయంత్రం ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన పోలీసులు గంటల వ్యవధిలోనే పిల్లలను గుర్తించారు. ఒకటో రోడ్డులోని మిత్ర హోటల్ సమీపంలో నివాసం ఉంటున్న ఉదయసింహా, జానకి రామ్‌నగర్‌కు చెందిన సాత్విక్ రెడ్డి, గంగానగర్‌కు చెందిన రాఘవేంద్ర రెడ్డి సోమవారం సాయంత్రం ఇంటి నుంచి పరారయ్యారు. రెండు సైకిళ్లను వెంట తీసుకెళ్లారు. పిల్లలు కనిపించక పోవడం, అదే సమయంలో ఉదయ సింహ రాసిన లేఖ కనిపించడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. దీంతో సీఐ ధరణి కిషోర్ వెంటనే తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలను జల్లెడ పట్టారు. మొదటి రోడ్డులోని డాక్టర్ శివాజీక్లినిక్ సమీపంలో ఉన్న ఒక ఇంటి మేడపై ఉండగా, పిల్లలను పట్టుకున్నారు. దీంతో బాధిత తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.

క్లుప్తంగా

సబ్సిడీ పప్పుశనగ పంపిణీ



ఆత్మకూరులో రైతులకు సబ్సిడీ పప్పుశనగ అందిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు సబ్సిడీ పప్పుశనగను అందజేశారు. ఏఓ సుచరిత మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇప్పటికే వంద క్వింటాళ్ల పప్పుశనగ రైతులకు అందించినట్లు తెలిపారు. ఎకరాకు 20 కిలోల బస్తా ఇస్తున్నట్లు తెలిపారు. ఒక క్వింటా ధర రూ.4,860 రైతు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఓ సుజిత, వైస్ ఎంపీపీ నీలిమ, వైఎస్సార్‌సీపీ నాయకులు అతికొరెడ్డి, వన్నూరప్ప, వీఏఏ భాగ్యలక్ష్మి తదితర రైతులు పాల్గొన్నారు.

నేడు రాజ్యాంగ పరిరక్షణ వేదిక సమావేశం

అనంతపురం కల్చరల్: స్థానిక ఎన్జీఓ హోంలో మంగళవారం సాయంత్రం రాజ్యాంగ పరిరక్షణ వేదిక తరఫున రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ ఓ ప్రకటనలో తెలిపారు. మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్, రసూల్ తదితరులకు మద్దతుగా నిర్వహించనున్న సమావేశానికి విద్యావంతులు, మేధావులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు ఎంపికైన ఆర్ట్స్ కళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, కళాశాల ఏఓ రమణ, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ రంగనాథ్ తదితరులు అభినందించారు. సోమవారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందుతున్న చివరి సంవత్సరం కేడెట్లు హరికృష్ణ, లక్ష్మీకాంత్, వంశీ గత ఆగస్టు నెలలో గుంటూరులో జరిగిన అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొన్నారు. అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జనరల్ డ్యూటీ ఆర్మీలో నియామక పత్రాలు అధికారులనుంచి అందుకున్నారు.

ఇన్‌ఫెక్షన్ కేసులపై ఫిర్యాదు

అనంతపురం మెడికల్: సర్వజనాస్పత్రిలోని కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించే వార్డులో ఇన్‌ఫెక్షన్ కేసులను ఉంచుతున్నారని ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజకు పీపీ యూనిట్ నిర్వాహకురాలు డాక్టర్ పుష్పలత ఫిర్యాదు చేశారు. సోమవారం జీజీహెచ్‌లో ఆర్‌ఎంఓకు సమస్యను వివరించారు. ఇన్‌ఫెక్షన్ కేసులు ఉంచడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అన్నారు. అందుకు ఆర్‌ఎంఓ సానుకూలంగా స్పందించి, పరిశీలిస్తామని తెలిపారు.

వందేభారత్‌తో ఒరిగిందేమీ లేదు



రైల్వే స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఏఐవైఎఫ్ కార్యకర్తలు

అనంతపురం సిటీ: వందేభారత్ రైళ్లతో పేదలు, సామాన్య, మధ్య తరగతి వర్గాల వారికి ఒరిగిందేమీ లేదని ఏఐవైఎఫ్ నాయకులు అన్నారు. సోమవారం అనంతపురం రైల్వే స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. నాయకులు మాట్లాడుతూ వందేభారత్ రైళ్ల టిక్కెట్ల ధరలు ఉన్నాయని, విమాన చార్జీలను తలదన్నేలా ఉన్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న కార్యక్రమాలు సంపన్న వర్గాల వారికి మాత్రమే ప్రయోజనం కలిగించేలా ఉన్నాయని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోశ్‌కుమార్ అన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రైల్వే స్టేషన్ మేనేజర్ అశోక్ కుమార్‌కు అందజేశారు. ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు శ్రీనివాసర్, ఆఫీస్ బేరర్ దేవ, శ్రీకాంత్, లిఖిల్, సకీల్ పాల్గొన్నారు.

నేరాలపై అవగాహన

తాడిపత్రి: పట్టణంలోని ట్రిపుల్‌ఎస్ ప్రభుత్వ మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు సోమవారం పట్టణ సీఐ హమీద్‌ఖాన్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈవ్ టీజింగ్‌కు ఎవరైనా పాల్పడినా, ఆ దిశగా ఎవరైనా ప్రయత్నం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే 94407 96861 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

యల్లనూరు: మండలంలో ఎక్కడైనా మట్కా, పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. సీఐ మాట్లాడుతూ మట్కా, పేకాట ఆడినా, ప్రోత్సహించినా సహించేదిలేదన్నారు. రౌడీషటర్లపై నిఘా పెంచామన్నారు. గ్రామాల్లో ప్రశాంత జీవనం సాగించాలన్నారు.

నేత్రాలున్నా.. నిఘా లోపం

- ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పనిచేయని సీసీ కెమెరాలు
- వైద్యసిబ్బంది వాహనాలు, సెల్‌ఫోన్ల అపహరణ
- కెమెరాలు మరమ్మతు చేయించడంలో జాప్యం



ప్రభుత్వ సర్వజనాస్పత్రి



సర్వజనాస్పత్రిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పర్యవేక్షణ విభాగం

అనంతపురం మెడికల్: నగరంలోని సర్వజనాస్పత్రిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయడంలేదు. తరచూ ద్విచక్ర వాహనాలు, మొబైళ్లు మయమవుతుండడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలోని సెక్యూరిటీ సిబ్బంది, ఔట్ పోస్టు పోలీసుల నిఘా కూడా కరువైందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు త్వరితగతిన సీసీ కెమెరాలను మరమ్మతు చేయించి, సక్రమంగా పనిచేసేలా చూడాలని సిబ్బంది కోరుతున్నారు.

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఐదు బ్లాక్‌లలో 116 సీసీ కెమెరాలు ఉన్నాయి. అందులో 45 మాత్రం పని చేస్తున్నాయి. మిగితా కెమెరాలు పూర్తి స్థాయిలో పని చేయలేదు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోజూ 2 వేల నుంచి 2,500 వరకు ఓపీ ఉంటుంది. అడ్మిషన్‌లో 1,300 మంది వరకు ఉంటారు. పేషంట్ అటెండర్స్ 2 వేల నుంచి 3 వేల మంది వరకు వస్తుంటారు. ప్రధానంగా కాన్పుల వార్డు, చిన్నపిల్లల వార్డులోనూ చిన్నారులుంటారు. ఈ ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో పని చేయకపోవడం తలనొప్పిగా మారింది.

మాయమవుతున్న స్కూటీలు, మొబైళ్లు..

- ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో విధులు నిర్వర్తించే ఓ స్టాఫ్‌నర్సు ఈ ఏడాది జూలైలో ఏఎంసీ వార్డు ఎదుట యాక్టివ పార్కింగ్ చేసింది. విధులు ముగించుకొని వచ్చి చూస్తే వాహనం కనిపించలేదు. బాధితురాలు స్కూటీ అపహరణకు గురైందని టూటౌన్ పోలీసు స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాలు లేకపోవడంతో తామేమీ చేయమన్నట్లు పోలీసులు సమాధానం చెప్పినట్లు సమాచారం.
- సర్వజనాస్పత్రిలోని ఆర్థో వార్డులో విధులు నిర్వర్తించే మరో స్టాఫ్ నర్సు స్కూటీ కూడా ఇటీవల అపహరణకు గురైనట్లు తెలిసింది.
- మెడిసిన్ విభాగంలో విధులు నిర్వర్తించే ఓ అసోసియేట్ ప్రొఫెసర్ ఆండ్రాయిడ్ మొబైల్ పోగొట్టుకుపోయింది. ఇలా ఆస్పత్రిలోని వివిధ వార్డుల్లో వరుస చోరీలు జరుగుతుండడంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

పనుల్లో తీవ్ర జాప్యం:

బోధనాస్పత్రిలో వివిధ బ్లాక్‌లలో మరమ్మతులు, పునర్నిర్మాణానికి (రిపైర్స్, రెనోవేషన్స్) ప్రభుత్వం రూ.3.5 కోట్లు రెండు నెలల క్రితం మంజూరు చేసింది. ఆస్పత్రిలో ప్రాధాన్యతా క్రమంలో మొదటగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు ముందుచూపులేకుండా వ్యవహరించడంతో వాటి మరమ్మతుల్లో జాప్యం జరుగుతోంది.

> **మరమ్మతు చేయిస్తున్నాం**
>
> ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సీసీ కెమెరాలు మరమ్మతుకు గురైన మాట వాస్తవమే. వాటి మరమ్మతు పనులు ప్రారంభించాం. మరో రెండు, మూడు రోజుల్లో త్వరితగతిన మరమ్మతు పనులు పూర్తి చేయించి, యథావిధిగా పనిచేసేలా చర్యలు తీసుకుంటాం.
>
> – మహబూబ్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ

నేడు నంబర్ -1 స్కూల్‌లో 'ఆరోగ్య సురక్ష'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పాతూరు నంబర్ - 1 పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ కే భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయ అధికారులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 19,20,21 సచివాలయాల పరిధిలోని సున్నపుగేరి, ఉమానగర్, తదితర ప్రాంత ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు తలుపూరులో..

ఆత్మకూరు: మండలంలోని తలుపూరు గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్ ఓ ప్రకటనలో తెలిపారు.

రేపు జగనన్న ఆరోగ్య సురక్ష

రాప్తాడు: మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని సచివాలయం దగ్గర బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్, వైద్యాధికారి శ్రావణి, తహసీల్దార్ లక్ష్మీనరసింహ ప్రకటనలలో తెలిపారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పందనలో ఏడు అర్జీలు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం జరిగిన స్పందనలో ఏడు అర్జీలు అందాయి. నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు ఫిర్యాదులు స్వీకరించారు. పబ్లిక్ హెల్త్ 3, టౌన్ ప్లానింగ్ 3, ఇంజినీరింగ్ సెక్షన్ 1 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఈ నాగమోహన్, టీపీఓ శిరీష, సూపరింటెండెంట్ సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్యం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కనగానపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరికీ ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయని ఈఓఆర్డీ అనిల్‌కుమార్ తెలిపారు. సోమవారం దాదులూరులోని సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన 240 మందికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. 12 మందిని శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. కాగా ఈ వైద్య శిబిరాన్ని మధ్యాహ్నం డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియాన్ సోలమాన్ తనిఖీ చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ప్రశాంత్, చైతన్య, సుధీర్‌కుమార్, ఎంపీహెచ్ఈఓ మనోహర్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, పలువురు ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగ్గురు ఏఆర్ కానిస్టేబుళ్లకు పదోన్నతి



ఎస్పీ అన్బురాజన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఆర్ కానిస్టేబుళ్లు

అనంతపురం క్రైం: ఏఆర్ విభాగంలో పని చేస్తున్న ముగ్గురు కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ జిల్లా ఎస్పీ అన్బురాజన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 1995, 98 బ్యాచ్‌కు చెందిన ముగ్గురు ఏఆర్ కానిస్టేబుళ్లు పదోన్నతి పత్రాలు అందుకున్న అనంతరం ఎస్పీని ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు త్రిలోక్, సుధాకర్‌రెడ్డి, గాండ్లహరి పాల్గొన్నారు.



విజయవాడలో సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

హంద్రీనీవా ద్వారా చెరువులు నింపండి



తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

కనగానపల్లి: మండలంలోని చెరువులను హంద్రీనీవా కాలువ ద్వారా నీరు నింపాలని రైతు సంఘం నాయకులు అధికారులను కోరారు. దీనిపై సోమవారం స్పందనలో రైతు సంఘం నాయకులు తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు గోవిందు, బాలరాజు మాట్లాడుతూ ఈఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువుల్లో నీరు తగ్గిపోయాయన్నారు. హంద్రీనీవా ద్వారా వచ్చే కృష్ణా జలాల ద్వారా చెరువులు నింపి రైతులు రబీ పంటలు సాగు చేసుకునేందుకు వీలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఈశ్వరయ్య, నాగరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

అనంతపురం క్రైం: పెళ్లి పేరుతో మహిళను మోసం చేసిన వ్యక్తిపై దిశ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. సీఐ చిన్న గోవిందు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఆరో రోడ్డులో నివాసం ఉంటున్న ఓ వివాహితకు భర్త దూరంగా ఉంటున్నాడు. ఈవిషయం తెలుసుకున్న ఆజాద్ నగర్‌కు చెందిన అలీ అనే వ్యక్తి ఆమెకు దగ్గర అయ్యాడు. ఆమెకు సహాయం చేస్తున్నట్లు నటించి, భర్తతో ఆమెకు విడాకులు ఇప్పించాడు. అనంతరం పెళ్లి చేసుకోకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. దీనికి తోడు అతని భార్య, బంధువులు వివాహితపై దాడి చేశారు. బాధితురాలు దిశ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పశు వైద్య శిబిరానికి స్పందన



మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

కూడేరు: మండలంలోని కలగళ్లలో సోమవారం ప్రధానమంత్రి కృషి సంచాయీ యోజన పథకం కింద వాటర్ షెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని విశేష స్పందన లభించింది. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వాహణాధికారి(డీఎల్‌డీఏ ఈఓ) డాక్టర్ సుధాకర్ పశువులకు వైద్య సేవలు అందించారు. రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పశువులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత వహించాలన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పాడి రైతులకు దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ టీఓ విశ్వనాథ్ రెడ్డి, చైర్మన్ భాస్కర్ రెడ్డి, మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు, గోపాల మిత్రలు రామాంజనేయులు, సుబ్బరాయుడు, ప్రమీలమ్మ, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ స్ప్రేయింగ్ లాభదాయకం



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: డ్రోన్ స్ప్రేయింగ్‌తో లాభాలు ఉంటాయని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం తాడిపత్రి రూరల్ మండలంలోని దిగువపల్లిలో రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో డ్రోన్ స్ప్రేయింగ్‌పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ కిశోర్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ డ్రోన్ స్ప్రేయింగ్‌తో తక్కువ ఖర్చుతో పంట పొలాలకు స్ప్రేయింగ్ చేసుకోవచ్చన్నారు. ఆముదం పంటలో ఎకరా పొలంలో 10 లీటర్ల నీటిని కలిపి స్ప్రేయింగ్ చేసి చూపించారు. పత్తిలో గులాబి రంగు పురుగు నివారణపై అవగాహన కల్పించారు. పత్తి పంటలో ఫిరమోన్ ట్రాప్‌లు ఎకరాకు 15 నుంచి 20 చొప్పున పెట్టుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫార్మాసిస్టుకు గాయాలు

శింగనమల: తరిమెల పీహెచ్‌సీలో పని చేస్తున్న ఫార్మాసిస్టు నల్లప్ప సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అనంతపురం నుంచి ద్విచక్ర వాహనంలో కల్లూరు మీదుగా తరిమెల పీహెచ్‌సీకి వెళ్తుండగా, మార్గంమధ్యలో మరో ద్విచక్రవాహనం ఢీకొనింది. ఈప్రమాదంలో అతనికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

బీఎస్సీ కెమిస్ట్రీ ఆనర్స్ కోర్సు మంజూరు

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాలుగేళ్ల బీఎస్సీ కెమిస్ట్రీ (ఆనర్స్) కోర్సు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మయ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడేళ్ల బీఎస్సీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా నాలుగో సంవత్సరంలో ప్రవేశానికి అర్హులన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 14లోగా కళాశాల కెమిస్ట్రీ విభాగంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జీతాల విడుదలకు ఉత్తర్వుల జారీపై హర్షం

అనంతపురం ఎడ్యుకేషన్: ఎంఈఓ–2లకు జీతాల విడుదలకు ఉత్తర్వులు జారీ చేయడంపై వైఎస్సార్‌టీఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.ఓబుళపతి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ప్రభుత్వం ఎంఈఓ–2 పోస్టులు మంజూరు చేసింది. ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి, భర్తీ చేసింది. వీరికి జీతాల చెల్లింపులు, సెలవులు తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్య కమిషనర్ అండ్ డైరెక్టర్ యస్.సురేష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారని తెలిపారు. ఎంఈఓ–2 లకు జీతాల విడుదలకు డ్రాయింగ్ పవర్స్‌ను డీఈఓ కార్యాలయం ఏడీ–1లకు, సెలవులు, ఇంక్రిమెంట్లు మంజూరు అధికారాలు డీవైఈఓలకు అప్పగించినట్లు ఓబుళపతి తెలిపారు. రాష్ట్ర విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

విలువిద్య పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన చిత్రచేడు హైస్కూల్ విద్యార్థులు

పెద్దవడుగూరు: చిత్రచేడు జెడ్పీ పాఠశాల విద్యార్థులు సలీం, మంజునాథ్ రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఇటీవల బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ విలువిద్య ఇండియన్ రౌండ్ విభాగంలో విద్యార్థులు సత్తా చాటారన్నారు. వీరు మన్యం జిల్లాలోని పార్వతీపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగు అండర్–14 జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు 8వ తరగతి విద్యార్థులు సురేంద్ర, మంజునాథ్, సూర్యవంశీ ఎంపికైనట్లు తెలిపారు.

289 మందికి వైద్య పరీక్షలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని గాంధీ నగర్‌లోని సచివాలయం–4 పరిధిలో మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 289 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వైద్య పరీక్షలు చేసుకున్న వారికి వైద్యులు ఆరోగ్య సంరక్షణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, మండల సహకార సంఘం సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఆలూరి రమణారెడ్డి, గువ్వల రాజశేఖర్‌రెడ్డి, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనాథ అమ్మాయిలకు 'అమ్మ' ఆసరా



అమ్మాయిలకు ఆర్థిక సాయం అందిస్తున్న అమ్మ సంస్థ అధ్యక్షుడు రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: నరసనాయనికుంటకు చెందిన ముగ్గురు అమ్మాయిల చదువుకు 'అమ్మ'స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి చేయూతనందించారు. నారాయణపురం పంచాయతీ నరసనాయనికుంటకు చెందిన కుళ్లాయప్ప, దేవమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కొడుకు సంతానం. దశాబ్దం క్రితం కుళ్లాయప్ప మరణించగా, అతని భార్య దేవమ్మ పండ్లు అమ్ముతూ ముగ్గురు పిల్లలనూ చదివించేందుకు అహర్నిశలూ శ్రమించింది. అయితే బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న ఆమె..గత నెలలో మరణించింది. దీంతో పీజీ చదువుతున్న పెద్ద కూతురు కవిత, డిగ్రీ చదువుతున్న కళ్యాణి, ఇంటర్ చదువుతున్న కళ్యాణ్ అనాథలయ్యారు. విషయం తెలిసిన అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డి స్పందించారు. రూ.50 వేలు వెచ్చించి ఇద్దరు అమ్మాయిల కళాశాల ఫీజులు చెల్లించి, నూతన వస్త్రాలు, నిత్యావసర వస్తువులు అందించారు.

డ్రిప్పు వాడకంలో జాగ్రత్తలు అవసరం

- ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ ఖాన్



రైతులకు అవగాహన కల్పిస్తున్న పీడీ ఫిరోజ్‌ఖాన్

బుక్కరాయసముద్రం: డ్రిప్పు, స్ప్రింక్లర్ల వాడకంలో రైతులు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఫిరోజ్ ఖాన్ తెలిపారు. సోమవారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో రైతులకు డ్రిప్పు స్ప్రింక్లర్లు వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. పీడీ ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు రాయితీలతో డ్రిప్పు పరికరాలు మంజూరు చేస్తోందన్నారు. డ్రిప్పు, స్ప్రింక్లర్ల వాడకంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం పంపిణీ చేసే పరికరాల్లో ఏజెన్సీలు ఆలస్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఏపీఎంఐపీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. ప్రభుత్వం రాయితీతో మంజూరు చేసిన డ్రిప్పు, స్ప్రింక్లర్లను రైతులు తప్పనిసరిగా పొలాల్లో అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ మైక్రో ఇరిగేషన్ ఇంజినీరు కరుణ, మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్ హరిత, పారగాన్ కంపెనీ రీజినల్ కోఆర్డినేటర్ సురేంద్ర, డీలర్ చిన్నపరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో శౌర్య జాగరణ యాత్ర



రథయాత్రకు సంప్రదాయ కోలాటంతో స్వాగతం పలుకుతున్న కళాకారులు

అనంతపురం కల్చరల్: విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ చేపట్టిన శౌర్య జాగరణ యాత్ర సోమవారం అనంతకు చేరుకుంది. భారీ ఎత్తున తరలివచ్చిన వీహెచ్‌పీ కార్యకర్తలు, ఆర్‌ఎస్ఎస్ స్వయం సేవకులు భాజాభజంత్రీలతో జై శ్రీరామ్ నినాదాలు చేస్తూ రథయాత్రకు స్వాగతం పలికారు. నాట్యాచార్యులు దేవరకొండ కౌసల్య నేతృత్వంలో కళాకారులు సంప్రదాయ కోలాటం చేస్తూ అందరిలో హుషారు నింపారు. పాతూరు చెరువుకట్ట వినాయక స్వామి ఆలయం నుంచి నగర వీధుల్లో రథయాత్ర సాగింది.

సనాతన ధర్మ రక్షణే ధ్యేయం

సనాతన ధర్మ పరిరక్షణే ధ్యేయంగా రథయాత్ర సాగుతోందని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అక్కిశెట్టి జయరామ్ రాయల్, చిన్మయామిషన్ జిల్లా ఇన్‌చార్జ్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి అన్నారు. విశ్వహిందూ పరిషత్తు ఆవిర్భవించి 60 ఏళ్లు దాటడం శుభపరిణామన్నారు. శౌర్య జాగరణ యాత్ర ద్వారా అందరినీ హైందవ ప్రచారం దిశగా జాగృతం చేయడానికి స్వామీజీలు తరలివస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

యాడికి: మండల కేంద్రంలోని కోన రోడ్డులోని చౌడేశ్వరీ కాలనీ రహదారిలో మండల కేంద్రానికి చెందిన రాంభూపాల్, ప్రసాద్‌కు చెందిన రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరూ గొడవ పడుతుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి అక్కడికి చేరుకుని ఇద్దరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

శింగనమల: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. బుక్కరాయసముద్రం మండలంలోని కొర్రపాడు–1,2 సచివాలయాలు, గార్లదిన్నె మండలంలోని ఎర్రగుంట్ల, నార్పల మండలంలోని శిద్దరాచెర్ల, పుట్లూరు మండలంలోని కడవకల్లు, శింగనమల మండలంలోని సీ బండమీదపల్లి, యల్లనూరు మండలంలోని కూచివారిపల్లి సచివాలయాల్లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

'స్పందన'లో మూడు వినతులు

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో జరిగిన స్పందనలో ప్రజల నుంచి మూడు వినతులు వచ్చినట్లు తహసీల్దారు సుమతి తెలిపారు.